క్లుప్తంగా

108 సిబ్బందికి సన్మానం



పెద్దేముల్ 108 సిబ్బందిని సన్మానిస్తున్న గాజీపూర్ యువకులు

తాండూరు రూరల్: పుట్టిన పసికందుకు సీపీఆర్ చేసి పునర్ జన్మనిచ్చిన పెద్దేముల్ 108 సిబ్బందికి పలువురు అభినందించారు. మండలంలోని గాజీపూర్ గ్రామానికి చెందిన యువకులు శనివారం లొకేషన్ వద్ద ఈఎంటీ నర్సిములు, పైలెట్ మహేష్‌లను శాలువా కప్పి సన్మానించారు. ఈ నెల 13వ తేదీన బండమీదిపల్లి గ్రామానికి చెందిన మాల నాగమ్మ అంబులెన్స్‌లో ప్రసవించింది. అయితే పుట్టిన బిడ్డ చలనం లేకపోవడంతో ఆ పసిబిడ్డకు ఈఎంటీ నర్సిములు సీపీఆర్ చేసి బతికించారు. సిబ్బందిని సన్మానించిన వారిలో సంగమేశ్వర్, జనార్దన్, అనిల్, శివానంద్, శ్రీను, కృష్ణ, రాము, నవీన్, బాలు, చంద్రశేఖర్, నవీన్, నర్సిములు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంరక్షణకు నిరంతరం కృషి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న కుటుంబ సంక్షేమ నిధి కోఆర్డినేటర్ వెంకటేశ్

కుల్కచర్ల: ఉపాధ్యాయుల సంరక్షణకు టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని చౌడాపూర్ మండల యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కుటుంబ సంక్షేమ నిధి మండల కోఆర్డినేటర్‌గా వెంకటేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ‘ఒక్కరి కోసం అందరం, అందరికోసం ప్రతీ ఒక్కరం’ అనే సిద్ధాంతంతో కుటుంబ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారన్నారు. అందరి సహకారంతో ఉపాధ్యాయులందరూ తమ జీతంలో కొంత నగదు సంక్షేమ నిధికి జమచేస్తే భవిష్యత్‌లో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు అనిల్, బసయ్య, ప్రవీణ్, వినయ్, శ్రీనివాస్, జహీర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చౌడాపూర్‌లో చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరమని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. చౌడాపూర్ గ్రామానికి చెందిన పరిగి గాలయ్య కుటుంబీకులు అనారోగ్యంతో ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ సందర్భంగా మంజూరైన సీఎం సహాయనిధి రూ. 24వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ..నిరుపేద కుటుంబాలకు మెరుగైన చికిత్స చేయించుకోవడానికి సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సలీం, గోపాల్, నర్సింలు, అంజయ్య, నరేష్, తుకారం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా అనిల్

బంట్వారం: బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడిగా సుందరి అనిల్ ఎన్నికయ్యారు. శనివారం కోట్‌పల్లి ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అనిల్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి విధేయుడిగా పని చేస్తానన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీని మరింత పటిష్టం చేస్తానన్నారు.

ప్రారంభమైన చెన్న కేశవ స్వామి వీధి నాటకం

దుద్యాల్: మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లిలో చెన్నకేశవ స్వామి వీధి నాటకాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. మొదటి రోజు గ్రామ పెద్దలను సన్మానించి నాటకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాటక ఉపాధ్యాయుడు ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో వీధి నాటకాలు పూర్తిగా అంతరిస్తున్నాయని, సినిమాలపై మక్కువ పెంచుకుంటున్నారన్నారు. వీధి నాటకాలు సినిమాల కంటే అత్యంత ప్రఖ్యాతిగాంచినవి, ప్రజలు వీధి నాటకాలపై మరింత ఆసక్తి పెంచుకోవాలని కోరారు. ఈ నాటకాన్ని వీక్షించాడానికి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ఆసక్తి కలిగిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వీక్షించారు.

సర్కారు బడిలో సౌకర్యాలు మెండు



ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు



గురుకుల పాఠశాల సీటు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్

- ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన
- మెరుగైన విద్యా బోధనే లక్ష్యం

బొంరాస్‌పేట: ప్రభుత్వ బడులు పేద విద్యార్థులకు గుడులు, అంటూ మండల పరిధిలోని ఎన్కేపల్లిలో శనివారం ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధనే లక్ష్యమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంత్సరం నుంచి తమ పిల్లలను స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించాలని ఇంటింటి సర్వే చేపట్టి అవగాహన కల్పించారు. గతంలో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో గ్రామంలోని విద్యార్థులంతా ఇతర గ్రామాలకు పంపిస్తున్నామని తల్లిదండ్రులు చెప్పారు. ఉచితంగా మెరుగైన విద్య, భోజనం అందిస్తున్నామని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. ఇంకా స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచితంగా బ్యాగులు, నోటుపుస్తకాలు, ఇతర బోధనాభ్యసన సామగ్రి, వసతులు కల్పిస్తున్నామన్నారు. తమ పాఠశాల నుంచి గురుకులాలకు వెళ్లి చదువుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వచ్చే విద్యాసంత్సరం నుంచి పలువురు కుటుంబాలవారు సర్కారు బడికి పంపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

గ్రామం నుంచి ఇతర పాఠశాలలకు..

గ్రామం నుంచి ఇతర పాఠశాలలకు వెళ్లే 1నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల వివరాల కోసం మహిళా సంఘాలకు సర్వే పత్రాలు ఇచ్చారు. గ్రామ సంఘం బాధ్యతగా సర్వే చేసి పాఠశాలకు పంపించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు గ్రామ సంఘం సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 23న జరిగే పాఠశాల సమావేశానికి తల్లిదండ్రులు, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

అభినందన, వీడ్కోలు..

స్థానిక పాఠశాల నుంచి గురుకుల ప్రవేశాలకు సీటు సాధించిన నాల్గోతరగతి విద్యార్థులు స్నేహశ్రీ, నిషిత్ కుమార్, ఆరాధ్య, వీరాట్, శివసాయి, శిరీషలను అభినందించారు. కేక్ కట్ చేసి తినిపించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఇందులో హెచ్ఎం జ్యోతి పరమేశ్వరి, ఉపాధ్యాయులు మహేశ్‌కుమార్, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు సంతోష, శివనీల, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం తగదు

పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయత్ రాజ్ ఏఈ సురేందర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనులను నిత్యం పరిశీలించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మఠంల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయండి

హస్నాబాద్ నుంచి ఆలేడ్ గ్రామం వరకు లంగర్‌కుంట మీదుగా వెళ్లే రోడ్డు దయనీయంగా ఉందని బీటీ రోడ్డు మంజూరు చేయాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయత్ రాజ్ ఏఈ సురేందర్ రెడ్డిలను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భీములు కోరారు. వెంటనే స్పందిస్తూ అధికారులు రోడ్డును పరిశీలించారు. త్వరలోనే బీటీ రోడ్డు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు.



పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు

హనుమాన్ ఆలయానికి భూమి పూజ



ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నర్సింహా రెడ్డి కుటుంబం

- రూ. కోటి వెచ్చించి పనులు చేపట్టనున్న నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: హకీంపేట్ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దుద్యాల్ మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక వాడకు హకీంపేట్ గ్రామం ప్రధానమైనది. ఈ గ్రామానికి చెందిన భూమి దాదాపు 700 ఎకరాలు పారిశ్రామిక వాడకు కేటాయించారు. భవిష్యత్‌లో జరగబోయే గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పూర్తిగా తొలగించి పెద్దగా నిర్మించనున్నట్లు వారు తెలిపారు. ఈ దేవాలయాన్ని రూ. కోటితో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో ఈ దేవాలయాన్ని కూల్చి కొత్తగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని నర్సింహా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

బంట్వారం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కోట్‌పల్లి మండల ముఖ్య నాయకుల సమావేశం కరీంపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని, కాంగ్రెస్ పాలనలో మరో 20 ఏళ్ల రాష్ట్రం వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ఈ ర్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు వెంకటేష్ యాదవ్, రాములు, ఉప్పరి మహేందర్, రాంచందర్, దశరథ్‌గౌడ్, మహబూబ్, ఉమాదేవి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్ రైతు పక్షపాతి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



దేవనూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ సర్కార్ రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని దేవనూరు, విశ్వనాథ్‌పూర్, యాలాల, సంగెంకుర్దు గ్రామాల్లో డీసీఎంఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వ మద్దతు ధరతో పాటు సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రమన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ ఒక చారిత్రక నిర్ణయమన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మన్నాన్, డైరెక్టర్లు, మొగులయ్య, శ్రీనివాస్, నాయకులు ఖాసీం, హన్మంతు, మహిపాల్, మధుసూదన్‌రెడ్డి, అమర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

యాలాల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. మండలం నుంచి మొత్తం 13 మంది లబ్ధిదారులకు రూ.13.01లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్

మర్పల్లి: దేశ ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్మెహన్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసి, దిష్టి బొమ్మ దహనం చేయడం బాధాకరమన్నారు. ఈ సంఘటనను నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం నుంచి పీఎస్ వరకు ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లపై కేసు నమోదు చేయాలని మర్పల్లి పీఎస్‌లో ఎస్ఐ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రధాన మంత్రిని దూషించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, శ్రీధర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఏబీఎస్ నాగయ్య, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రవీందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గణేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, మండల నాయకులు నాగరాజ్, సంతోశ్, మల్లేశ్, శేఖర్, నాగేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేసు నమోదు చేయాలని ఎస్ఐకి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు

అనంతగిరి: ఈదురు గాలులతో కూడిన వర్షాల వల్ల రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రమాదకర చెట్లు రోడ్లపై పడటంతో ప్రజల ప్రాణాలకు ముప్పు కలుగుతుందని, దీంతో పాటు గంటల కొద్ది ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్ తెలిపారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర చెట్లను, విద్యుత్ స్తంభాలను గుర్తించి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ తదితరులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం



దౌల్తాబాద్: సీమంతం చేస్తున్న టీచర్లు



మోమిన్ పేట: మేకవనం పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు

దౌల్తాబాద్: ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకుంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పేర్కొన్నారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో పోషణ్ పక్వాడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతం, అక్షరాభ్యాసం నిర్వహించారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా చిన్నారులకు అందించే పోషకాహారంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పరుశురాం, పంచాయతీ కార్యదర్శి నిర్మల, ఏఎన్ఎం మంగమ్మ, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, సంధ్యారాణి పాల్గొన్నారు.

మోమిన్ పేటలో..

మోమిన్ పేట: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మేకవనం పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విటమిన్లతో కూడిన ఆహారం తీసుకుంటేనే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు.

పోషకాహారం తప్పనిసరి

పూడూరు: పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ అనసూయ పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా శని వారం మండల పరిధిలోని మంచన్పల్లి అంగన్‌వాడీ ఒకటవ కేంద్రంలో పోషణ పక్వాడ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు సావిత్రి, స్వాతి, అనూష, అంజమ్మ, స్వప్న, పావని, తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉజ్వాల అన్నారు. శనివారం మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం అంగన్‌వాడీ టీచర్ అనితతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కాంతమ్మ, ఆశవర్కర్లు శోభ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా అభ్యున్నతికి కృషి

కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: క్రీడా అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ రెడ్డి, స్థానిక నాయకులు చంద్రభూపాల్, సోమలింగం, బాలకృష్ణ, భాస్కర్, షర్ఫొద్దీన్, యాదయ్య, వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా దుస్తులను అందజేస్తున్న నాయకులు

రైతులు మోసపోవద్దు

- సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి
- కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర



దోమ: రైతులు ఆరబోసిన వరి ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు



దౌల్తాబాద్: అంతారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి కోరారు. మండలంలోని అంతారం గ్రామంలో శనివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడుకు రూ.2,320, బిగ్రేడుకు 2,300 చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రమోద్‌రావు, సీఈఓ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: ప్రభుత్వం వెంటనే వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండల పరిధిలోని చెంగోల్ గ్రామ రైతులు కోరుతున్నారు. ఇప్పటికే వరి కోతకోసి గ్రామ సమీపంలోని బైపాస్ రోడ్డుపై ఆరబోశారు. అకాల వర్షంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పినట్లు రైతులు చెబుతున్నారు. తక్షణమే వరికొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

దోమ: రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించబోమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలో రైతులు కోతలు కోసి ఆరబోసుకున్న వరి ధాన్యం కుప్పలను మాజీ పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్‌తో పాటు యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అకాల వర్షాలు రైతులకు అతలాకుతలం చేస్తుంటే ప్రభుత్వం కనీస వసతులను కల్పించకపోవడం బాధాకరమన్నారు. మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికి కేవలం రాకొండ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని నామమాత్రంగా ప్రారంభించారన్నారు. కానీ అందులో సైతం వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లలో టార్పలిన్లు, గొనేసంచులు లేని దుస్థితి నెలకొందన్నారు. రైతులను మభ్యపెట్టి ఈ ప్రభుత్వం కాలం వెలదీస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సరైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సల్తాన్‌పూర్, చిగురాల్‌పల్లి, గడిసింగాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ నాయకులు తౌర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.